అన్న క్యాంటీన్ల ప్రారంభం వాయిదా

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 14: నగర పాలక సంస్థ పరిధిలో నూతనంగా ఏర్పాటైన అన్న క్యాంటీన్ల ప్రారంభం వాయిదా పడింది. ఈ క్యాంటీన్లను 15న ప్రారంభించాల్సి ఉండగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాల రాకపోవడంతో వాయిదా వేసినట్లు అధికారులు తెలిపారు. నెలాఖరులో ప్రారంభించే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. నగరపాలక సంస్థ పరిధిలో మొత్తం 5 అన్నక్యాంటీన్లను సిద్ధం చేస్తున్నారు. అయితే కొండారెడ్డిబురుజు, కలెక్టరేట్, ఎస్టేట్ సెట్యూర్ కార్యాలయం, ఉల్చాల రోడ్డులోని పరిమళ నగర్, ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఉన్న క్యాంటీన్‌ను సెప్టెంబరులో ప్రారంభించనున్నారు.

పంద్రాగస్టుకు సర్వం సిద్ధం

ముస్తాబైన ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు - నేడు పోలీసు పరేడ్ మైదానంలో 78వ స్వాతంత్ర్య వేడుకలు

జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్న మంత్రి టీజీ భరత్


కొండారెడ్డి బురుజు వద్ద జాతీయ పతాకాలతో కలెక్టర్ రంజిత్ బాషా, ఎంపీ బస్తిపాటి నాగరాజు, మేయర్ రామయ్య



హర్ ఘర్ తిరంగాలో భాగంగా నగరంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థినులు


కర్నూలు(కల్చరల్), ఆగస్టు 14: భారతదేశ 78వ స్వాతంత్రత్య దినోత్సవాన్ని గురువారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. మామిడి తోరణాలు, రంగుల కాగితాలు కట్టి ప్రభుత్వ ప్రైవేట్ కార్యాలయాలను ముస్తాబు చేశారు. త్రివర్ణ వన్నెల్లోని జాతీయ పతాకాలను ఎగురవేసేందుకు సిద్ధం చేసుకున్నారు. నగరంలోని ట్రాఫిక్ ఐల్యాండ్‌ను, వివిధ కూడళ్లను త్రివర్ణ శోభిత విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. కర్నూలు జిల్లా పేరుచెబితే గుర్తొచ్చే కొండారెడ్డి బురుజు త్రివర్ణ పతాక రంగులతో ముస్తాబై అందరినీ ఆకట్టుకుంటోంది. గురువారం ఉదయం నుంచి నగరంలోని జిల్లా పోలీసు కవాతు మైదానంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లు అధికారులు పూర్తి అయ్యాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రి టీజీ భరత్ హాజరై ఉదయం 9:05 గంటలకు జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారని కలెక్టర్ తెలిపారు. అనంతరం పోలీసు సాయుధ దళాల గౌరవ వందనం స్వీకరిస్తారన్నారు. 9:15 గంటలకు మంత్రి టీజీ భరత్ జిల్లా ప్రజలనుద్దేశించి స్వాతంత్ర్య దినోత్సవ సందేశం ఇస్తారని తెలిపారు. అనంతరం 9:35 గంటలకు సాయుధ దళాల మార్చ్‌ఫాస్ట్, 9:50 గంటలకు స్వాతంత్ర సమరయోధుల కుటుంబాలకు, జిల్లా ప్రజా ప్రతినిధులకు అభినందనలు తెలియజేస్తారని తెలిపారు. 9:55 గంటలకు ప్రభుత్వ శాఖల అభివృద్ధిపై 10 శాఖలకు చెందిన శకటాల ప్రదర్శన, సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయన్నారు. అనంతరం ప్రశంసా పత్రాల పంపిణీ చేస్తారు.

హర్ ఘర్ తిరంగా ర్యాలీ

కర్నూలు స్పోర్ట్స్: నగరంలో కొండారెడ్డి బురుజు నుంచి స్థానిక డీఎస్‌ఏ అవుట్ డోర్ స్టేడియం వరకు బుధవారం హర్ ఘర్ తిరంగా నినాదంతో ర్యాలీ నిర్వహించారు. కొండారెడ్డి బురుజు నుంచి స్టేడియం వరకు జరిగిన ర్యాలీలో వివిధ కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు, క్రీడాకారులు తదితరులు జాతీయ జెండాలను ప్రదర్శించారు. ఈ ర్యాలీలో ఎంపీ బస్తిపాటి నాగరాజు, కలెక్టర్ పి. రంజిత్ బాషా, మేయర్ బీవై రామయ్య, ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, కమిషనర్ రామలింగేశ్వర్, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, సెట్కూరు సీఈవో రమణ, టూరిజం అధికారి విజయ, క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, విద్యా సంస్థల అధినేత కేవీ సుబ్బారెడ్డి, న్యాయవాది శ్రీధర్ రెడ్డి, క్రీడా సంఘాల ప్రతినిధులు రామాంజనేయులు, అవినాశ్‌శెట్టి, గిడ్డయ్య, పీడీ, పీఈటీలు, క్రీడాబిమానులు, హర్షవర్దన్ తదితరులు పాల్గొన్నారు.

సప్త రాత్రోత్సవాలను విజయవంతం చేయండి

- 20న పూర్వారాధన, 21న మధ్యారాధన, 22న రథోత్సవం
- పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు


విలేకరులతో మాట్లాడుతున్న పీఠాధిపతి

మంత్రాలయం, ఆగస్టు 14: మంత్రాలయం రాఘవేంద్రస్వామి 353 సప్తరాత్రోత్సవాలను విజయవంతం చేయాలని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు అన్నారు. బుధవారం స్వామీజీ గదిలో ఉత్సవాలపై విలేకర్ల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాలు ఈనెల 18 నుంచి 24 వరకు ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 20న పూర్వారాధన, 21న మధ్యారాధన, 22న ఉత్తరాధనరోజు మహా రథోత్సవం కన్నుల పండుగగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాయంత్రం యోగీంద్ర కళామంటపంలో దాసవాణి సాహిత్యం, కూచిపూడి నృత్యం, భరతనాట్యం, వీణా వాయిద్యం, పౌరాణిక నాటకాలు భక్తులను అలరిస్తాయని తెలిపారు. దాదాపు 5 లక్షల మంది భక్తులు పాల్గొంటారని, వారికి శ్రీమఠంలోని అన్ని శాఖల అధికారులు, ప్రభుత్వ అధికారుల సహకారంతో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

రాఘవేంద్ర జలప్రసాదం పేరుతో తాగునీటి ఏర్పాట్లు

మంత్రాలయంలో భక్తులకు తాగునీటి సమస్య లేకుండా శాశ్వతంగా రాఘవేంద్ర జల ప్రసాదం పేరుతో భారీ మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నట్లు పీఠాధిపతి తెలిపారు. అన్నపూర్ణ భోజన శాల, బృందావన గార్డన్ గెస్ట్ హౌస్, విజయేంద్ర వసతి గృహం (వీవీజీ 100 గదుల సముదాయం) దగ్గర ఏర్పాటు చేస్తామన్నారు. 353 ఉత్సవాల్లో రూ.3.16 కోట్లతో బెంగుళూరుకు చెందిన అశ్వత్థామ అనే భక్తుడు నిర్మించిన గురునివాస్ భవనం, రూ.80 లక్షల ఖర్చుతో ఎంటీఆర్ లైన్ మధ్వమార్గ్ కారిడార్ విస్తరణ, రాఘవేంద్రస్వామి గర్భగుడి శిలామంటపం పైభాగాన బంగారు పూత అలంకరణ(తూర్పువైపు), రూ.15 లక్షలు ఖర్చుతో బంగారు పూతతో రాఘవేంద్ర సర్కిల్ ఆధునికీకరణ వంటి పనులు పూర్తి చేశారు.

19న కర్ణాటక సీఎం సిద్ధరామయ్య రాక

ఉత్సవాల్లో రెండో రోజు 19న సోమవారం కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మంత్రాలయం వస్తున్నట్లు పీఠాధిపతి తెలిపారు. ఇన్ఫోసిస్ అధినేత్రి సుధానారాయణ మూర్తి, కేంద్ర మంత్రులు కుమారస్వామి దేవెగౌడ, శోభకరంధాట్లే, మైసూర్ మహారాజు యదువీర్‌కృష్ణదత్త చామరాజేంద్ర వడియార్, రాష్ట్ర మంత్రులు పాల్గొంటున్నట్లు తెలిపారు.

40 రోజుల పాటు ఆన్‌లైన్ శిక్షణ

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 14: జిల్లాలో 17 మంది సీనియర్ అసిస్టెంట్లు, ఆర్ఐలకు 40 రోజుల పాటు ఆన్‌లైన్ ద్వారా సర్వే మెయింటెనెన్స్ పరీక్షకు శిక్షణ పొందనున్నారు. శిక్షణ పొందిన అధికారులు పరీక్ష ఉత్తీర్ణత తర్వాత డిప్యూటీ తహసీల్దార్లుగా ఎంపిక కానున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు

- కలెక్టర్ పి.రంజిత్ బాషా

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 14: జిల్లా ప్రజలందరికీ కలెక్టర్ పి. రంజిత్ బాషా 78వ స్వాతంత్ర్య శుభాకాంక్షలు తెలిపారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో మహానుభావులు తమ ప్రాణాలను అర్పించారని, వారందరినీ ఈ సందర్భంగా స్మరించుకుందామన్నారు. వారి త్యాగాల పునాదులపైనే మన దేశ నిర్మాణం సాగిందన్నారు. వీరందరినీ స్మరించుకుంటూ స్వాతంత్రోద్యమ స్ఫూర్తితో జిల్లా అభివృద్ధి కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.

జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన నవ్య



(కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 14: రాష్ట్ర ప్రభుత్వ ఆశయాల మేరకు జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానని జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని జాయింట్ కలెక్టర్ చాంబర్‌లో ఆమె బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషాను జేసీ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా నవ్య మాట్లాడుతూ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. జిల్లాను అభివృద్ధి పథంలో ముందడుగు వేసేలా కార్యక్రమాలు అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యలను తీర్చే విధంగా రెవెన్యూ అధికారులు పని చేయాలని ఆదేశించారు. అనంతరం రెవెన్యూ అధికారులు, ఆర్డీవోలు, జిల్లా అధికారులు జేసీని మర్యాదపూర్వకంగా కలిశారు.

త్రీటౌన్ పోలీసుల ఓవరాక్షన్..!

- మెప్పు కోసం బాధితుడిపై విచక్షణారహితంగా దాడి
- నిజా నిజాలు తెలుసుకోకుండానే కేసు నమోదు



కర్నూలు, ఆగస్టు 14: పోలీసులు అంటే రక్షక భటులు.. చట్టాన్ని చేతిలోకి తీసుకోకుండా ప్రజలు, బాధితుల పక్షాన నిలిచి వారికి పబ్లిక్ సర్వెంట్లుగా ఉండాలి. కానీ ఓ పోలీస్ అధికారి మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరించాడు. ఏకపక్షంగా ఆరోపణలు విని బాధితుడిపైనే ఆగ్రహం ప్రదర్శించాడు. తాను పోలీసు అన్న విషయాన్ని కూడా మరిచి విచక్షణా రహితంగా దాడి చేసిన ఘటన కర్నూలు నగరంలోని త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. కర్నూలు జీజీహెచ్‌లో గిరీష్ అనే వ్యక్తి తన తండ్రిని చేర్పించాడు. ఈ క్రమంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ ఆయన కాస్త ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ క్రమంలో అక్కడ ఉన్న జూనియర్ డాక్టర్లకు బాధితుడు గిరీష్‌కు మధ్య వాగ్వాదం జరిగింది. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగి బంధువు గిరీష్‌కు జూనియర్ డాక్టర్ల మధ్య జరిగిన వాగ్వాదం నగరంలోని త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌కు చేరింది. జూనియర్ డాక్టర్లు గిరీష్ తమపై దాడి చేశారంటూ విచక్షణారహితంగా కొట్టి పోలీసులకు అప్పగించారు. అంతేకాకుండా స్టేషన్ ఎదుట ధర్నాకు దిగారు. సుమారు 30 మందికిపై జూనియర్ డాక్టర్లందరూ ఏకమై గిరీష్ తమపై దాడి చేశారంటూ అసత్య ఆరోపణలు చేస్తూ పోలీస్‌స్టేషన్‌లో బైఠాయించారు. దీంతో జూనియర్ డాక్టర్ల మెప్పు కోసం అక్కడే ఉన్న ఎస్ఐ మన్మధ విజయ్ తనను విచక్షణా రహితంగా బెల్టుతో కొట్టినట్లు బాధితుడు గిరీష్ ఆవేదన వ్యక్తం చేశాడు. బాధితుడు చెప్పేది కూడా వినకుండా ఆగ్రహంతో ఊగిపోయిన సదరు పోలీస్ అధికారి తన అధికార దర్పాన్ని ప్రదర్శించినట్లు సమాచారం. కేవలం జూనియర్ డాక్టర్ల మెప్పు కోసం బాధితుడిని ఓ పోలీస్ ఇలా కొట్టడం వివాదాస్పంగా మారింది. తాను జూనియర్ డాక్టర్ చొక్కా పట్టుకోవడమే నేరమైతే కేసు నమోదు చేయాలి కానీ.. ఇలా పోలీసులు కొట్టడం ఏమిటని బాధితుడు గిరీష్ కన్నీటి పర్యంతమయ్యాడు. తనను జూనియర్ డాక్టర్ వెనుక నుంచి కాలితో తన్నాడని, అందుకే తాను కోపంతో ఆ డాక్టర్ చొక్కా పట్టుకున్నట్లు వాపోయాడు. అక్కడ ఉన్న ఐదారుగురు జూనియర్ డాక్టర్లు తనను విచక్షణా రహితంగా కొట్టారనీ, ఈ విషయాన్ని వార్డులో ఉన్న సీసీ కెమెరాలో నమోదయ్యాయనీ బాధితుడు చెబుతున్నాడు. పోలీసులు సీసీ కెమెరాలు పరిశీలించకుండా, నిజానిజాలు తెలుసుకోకుండా తనపై దాడి చేశారంటూ ఆవేదన వ్యక్తం చేశాడు. ఇదిలా ఉండగా ఏదో కొందరి మెప్పు కోసం వాస్తవాలు తెలుసుకోకుండా విచాక్షణారహితంగా కొట్టే హక్కు పోలీసులకు ఎవరు ఇచ్చారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై ఎస్ఐ మన్మధ విజయ్‌ను వివరణ కోరేందుకు ఆంధ్రజ్యోతి సంప్రదించగా ఆయన ఫోన్ లిఫ్ట్ చేయకపోవడం గమనార్హం. త్రీటౌన్ పోలీసులపై డీజీపీ కోయ ప్రవీణ్, ఎస్పీ బిందుమాధవ్ ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూడాలి మరి.

జాయింట్ కలెక్టర్‌కు శుభాకాంక్షలు



జేసీ నవ్యకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఏపీఆర్ఎస్ఏ నాయకులు

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 14: కలెక్టరేట్ కార్యాలయంలోని బుధవారం నూతన జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన నవ్యకు ఏపీఆర్ఎస్ఏ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కలెక్టరేట్ ఏవోగా బాధ్యతలు చేపట్టిన రాజేశ్వరికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు గిరి కుమార్ రెడ్డి, నాగరాజు, వేణుగోపాల్, వెంకట్రాజు, వెంకటేశ్వరరెడ్డి, శివపార్వతి, లోకేశ్వరి, రఘు, సందీప్, సునీల్, సహేరాబాను పాల్గొన్నారు.

రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 14: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ చట్ట సవరణను వ్యతిరేకిస్తూ గుంటూరులో ఈనెల 18న జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఆవాజ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.అబ్దుల్‌సుభాన్ పిలుపునిచ్చారు. బుధవారం పాతబస్తీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చాక ముస్లింలపై దాడులు కొనసాగిస్తుందన్నారు. ఇందులో భాగంగానే పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ చట్టాన్ని సవరిస్తూ 40 ప్రతిపాదనలు పెట్టిందన్నారు. సమావేశంలో నాయకులు షేక్ నాసిర్ అహ్మద్, ఇలియాజ్, బయాజుల్ కరీం, సయ్యద్ అహ్మద్ పాల్గొన్నారు.

ఆర్‌పీఐ రాష్ట్ర కన్వీనర్‌గా సుకుమార్

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 14: రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పీఐ) రాష్ట్ర కన్వీనర్‌గా జి.జే.సుకుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం నగరంలోని ఎంఎస్9 ఫంక్షన్ హాలులో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎం.వెంకటస్వామి 70వ జన్మదిన వేడుకలను నిర్వహించారు. అనంతరం రాయలసీమ కన్వీనర్‌గా తోగురు ధర్మరాజును ఎన్నుకున్నారు. రాష్ట్ర కార్యవర్గసభ్యుడు తోట రవికుమార్, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు దిబ్బలమ్మ, శ్రీరాములు పాల్గొన్నారు.

ఉప కాలువకు గండి

రుద్రవరం, ఆగస్టు 14: మండలంలోని అప్పనపల్లె పైభాగంలో ఉన్న 19వ బ్లాక్ చానల్ ఉప కాలువకు గండి పడినట్లు రైతులు బుధవారం తెలిపారు. సాగునీరంతా వృథా అవుతుందని వాపోయారు. తెలుగుగంగ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కాలువ కింద తెలుగుగంగ ఆయకట్టు భూములు నీళ్లు లేక ఇబ్బంది పడుతున్నామన్నారు. సాగునీరు లేక పంటలకు పారించలేకపోతున్నామన్నారు.

అర్బన్ వార్డుల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ

» 29వ వార్డులో రోడ్డు, డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే గౌరు చరిత శంకుస్థాపన

కల్లూరు, ఆగస్టు 14: కల్లూరు అర్బన్ వార్డుల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించనున్నట్లు పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత తెలిపారు. బుధవారం 29వ వార్డులోని ఎస్.ఎస్.ఆర్ నగర్‌లో మేయర్ బీవై. రామయ్య, డిప్యూటీ మేయర్ ఎస్. రేణుకతో కలిసి రోడ్డు, డ్రైనేజీలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గౌరుచరిత మాట్లాడుతూ నగరంలో అధిక శాతం శివారు ప్రాంతాలు కల్లూరు అర్బన్‌లోనే ఉన్నాయని, అన్ని వార్డుల్లోని కాలనీల ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తామని అన్నారు. కార్యక్రమంలో కల్లూరు అర్బన్ వార్డుల అధ్యక్షుడు పెరుగు పురుషోత్తంరెడ్డి, ప్రభాకర్ యాదవ్, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి పాల్గొన్నారు.

● రోడ్డు వైండింగ్ పనులు పూర్తి చేయండి: గౌరు చరిత

నగరంలో నిలిచిపోయిన రోడ్ వైండింగ్ పనులు పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత అధికారులకు ఆదేశించారు. బుధవారం తన స్వగృహంలో ఆమె నగరపాలక సంస్థ కమిషనర్ లింగేశ్వరరావు, రోడ్డు భవనాల శాఖ డీఈ రాధికతో సమీక్షించారు. ఈ సందర్భంగా గౌరు చరిత మాట్లాడుతూ పాణ్యం నియోజకవర్గం పరిధిలోని నంద్యాల చెక్‌పోస్టు నుంచి నందికొట్కూరు రోడ్, అలాగే నంద్యాల రోడ్డు వైండింగ్ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న గౌరు చరిత

ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తాం

మెడికల్ యూనియన్ ఆఫీసును ప్రారంభించిన ఎంపీ



యూనియన్ జెండాను ఆవిష్కరిస్తున్న కర్నూలు ఎంపీ నాగరాజు

కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 14: త్వరలో జరిగే హెచ్‌డీఎస్ సమావేశంలో ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు తెలిపారు. బుధవారం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సి. ప్రభాకర్ రెడ్డితో కలిసి కర్నూలు ఎంపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఆసుపత్రిలో నెలకొన్న ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షులు హరిశ్చంద్ర నాయుడు, కె.సుశీలమ్మ, సీనియర్ నాయకులు లోకేశ్, నరసింహులు, రమేష్, సుందర్ రాజు, గీతా కళ్యాణి, మంగమ్మ, సావిత్రమ్మ, సర్జంట్ శ్రీనివాసులు, అసిస్టెంట్ సర్జంట్ ఉరుకుందయ్య, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మునెప్ప, నగర కార్యదర్శి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

జాతీయ స్ఫూర్తితో హర్ ఘర్ తిరంగా

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 14: 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రతి ఇంటా జాతీయ స్ఫూర్తి వెల్లివిరిసేలా జాతీయ జెండాను ఎగురవేయాలని డీపీవో నాగరాజు నాయుడు అన్నారు. బుధవారం జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో సిబ్బందితో హర్ ఘర్ తిరంగా ప్రతిజ్ఞను చేయించారు. ప్రభుత్వ సూచనల మేరకు ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసేలా చూడాలని పంచాయితీ కార్యదర్శులను ఆదేశించారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేద్దాం

గూడూరు: ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవే ద్దామని తహసీల్దార్ రామాంజనేయులు, ఎంపీడీవో విజయసింహారెడ్డి అన్నారు. బుధవారం గూడూరు పట్టణంలో హర్ ఘర్ తిరంగాలో భాగంగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఎంఈవో సునీలమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'ప్రతి విద్యార్థి దేశభక్తిని పెంచుకోవాలి'

ఓర్వకల్లు: ప్రతి విద్యార్థి చదువుతోపాటు దేశభక్తిని పెంచుకోవాలని ఎంఈవో ఓంకార్ యాదవ్, ఎంపీడీవో శివనాగప్రసాద్ సూచించారు. బుధవారం హర్ ఘర్ తిరంగాలో భాగంగా ఓర్వకల్లు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు, అధికారులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రామచంద్రరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

80 చెరువుల వద్ద పంద్రాగస్టు

కర్నూలు(అగ్రికల్చర్): కేంద్ర ప్రభుత్వం కర్నూలు జిల్లాలో అమృత్ సరోవర్ పథకం కింద ఆధునికీకరించిన చెరువుల్లో స్వాతంత్ర దినోత్సవ వేడుకలను నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించిందని డ్వామా పీడీ అమర్నాథ్ రెడ్డి తెలిపారు. దేశభక్తి, సాంస్కృతిక కార్యక్రమాలు రైతుల ద్వారా చేపట్టి చెరువుల వద్ద ఘనంగా పంద్రాగస్టు వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కర్నూలు జిల్లాలో 80 చెరువుల వద్ద జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్నట్లు డ్వామా పీడీ అమర్నాథ్ రెడ్డి తెలిపారు.



సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీపీవో నాగరాజు నాయుడు



ఓర్వకల్లులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



గూడూరులో..

వైసీపీలో మాజీ మంత్రి జోగిలాంటి తిమింగలాలెన్నో?

నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్



ఓర్వకల్లు, ఆగస్టు 14: గత వైసీపీ ప్రభుత్వంలో జోగి రమేష్ లాంటి తిమింగళాలు ఎన్నో ఉన్నాయని, అందరినీ బయట పెట్టి కోర్టుకు ఈడుస్తామని నంద్యాల టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. బుధవారం మండలంలోని హుశేనాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారాన్ని అడ్డం పెట్టుకుని జోగి రమేష్, కుటుంబ సభ్యులు చేసిన అక్రమాలు ఎన్నో ఉన్నాయని, ఒక్కొక్కటే బయటకు వస్తున్నాయని అన్నారు. అగ్రిగోల్డ్ బాధితుల పక్షాన నిలబెడుతానని, 2019 ఎన్నికల ముందు ప్రచారంలో చెప్పిన వైసీపీ నేతలు అధికారంలోకి రాగానే అగ్రిగోల్డ్ భూములను స్వాహా చేశారన్నారు. అగ్రిగోల్డ్ భూముల అన్యాక్రాంతంపై యజమాన్యం ఫిర్యాదుపై పోలీసు అధికారులు సుదీర్ఘ విచారణ తర్వాత చర్యలు తీసుకున్నారని అన్నారు.

ఏపీ బీవీఎస్ రాష్ట్ర కార్యదర్శిగా రమణయ్య

ఓర్వకల్లు, ఆగస్టు 14: ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయ సంఘం (ఏపీ వీబీఎస్) రాష్ట్ర కార్యదర్శిగా మండలంలోని హుశేనాపురం గ్రామానికి చెందిన కాటినేని రమణయ్య ఎంపికైనట్లు బుధవారం తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర కమిటీ నుంచి ఉత్తర్వులు వచ్చాయన్నారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర కార్యదర్శిగా ఎంపిక చేసిన రాష్ట్ర అధ్యక్షుడు విక్రమ్ నాయుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి క్రాంతి నాయుడు, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి జక్కుల శ్రీనివాసులకు కృతజ్ఞతలు తెలిపారు.

పనులను పూర్తి చేయండి

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 14: ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిజైన్ అండ్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్‌కు కల్పించాల్సిన మౌలిక సదుపాయాల పనులు త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ కలెక్టర్ పి.రంజిత్ బాషాను ఆదేశించారు. బుధవారం విజయవాడ సీఎస్ కార్యాలయం నుంచి వివిధ ప్రభుత్వ ఐఐఐటీడీఎం, ఎయిమ్స్ నిర్మాణ పనులపై అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ 4 నెలల లోపు ప్రహరీ నిర్మాణం పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, ఐఐఐటీడీఎం రిజిస్ట్రార్ గురుమూర్తి పాల్గొన్నారు.

'వీఆర్వోలు ప్రజలకు అందుబాటులో ఉండాలి'

సి.బెళగల్, ఆగస్టు 14: వీఆర్వోలు ప్రజలకు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ విజయశ్రీ అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో రైతుల నుంచి వచ్చే సమస్యలను పరిష్కరించడంలో వీఆర్వోలు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు నుంచి అధికంగా పొలం సమస్యలు ఎక్కువగా వస్తున్నాయని, గ్రామాలలో వీఆర్వోలు ఒక్కరి పొలాన్ని మరొకరికి ఆన్‌లైన్‌లో మార్పులు చేయడం వలన సమస్యలు వస్తున్నాయని రైతులు తెలిపారన్నారు. పొలం సమస్యలుంటే తమను సంప్రదించాలని తహసీల్దార్ రైతులకు సూచించారు. సర్వేయర్ నాగభూ షణం, వీఆర్వోలు పాల్గొన్నారు.

'పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలి'



మాట్లాడుతున్న ఎంపీడీవో రాముడు

సి.బెళగల్, ఆగస్టు 14: పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీడీవో రాముడు సర్పంచులకు సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో సర్పంచులకు మూడు రోజుల పాటు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్పంచ్‌లు విధులు, బాధ్యతలపై అవగాహన కలిగి ఉన్నప్పుడే గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. సమావే శంలో ఈవోఆర్డీ సందీప్, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజ, కలశ ప్రతిష్ఠ



ధ్వజస్తంభ ప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు

కోడుమూరు (రూరల్), ఆగస్టు 14: మండలంలోని ప్యాలకుర్తి సుంకులా పరమేశ్వరీదేవి ఆలయంలో బుధవారం శిఖర కలశం, ధ్వజస్తంభం ప్రతిష్ఠ వైభవంగా చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయంలో మూడు రోజులుగా వేదపండితుల అధ్వర్యంలో విశేషపూజలు, హోమాలు శాస్త్రోక్తంగా జరిపించారు. చివరి రోజున శిఖర కలశం, ధ్వజస్తంభం ప్రతిష్ఠ సందర్భంగా గ్రామ ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి తిలకించారు. ఈ కార్యక్రమంలో పెద్దఆదెన్నయాదవ్, చిన్న ఆదెన్నయాదవ్, డాక్టర్ లక్ష్మణ్‌కుమార్, శిరిబాబుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అంకిత భావంతో పనిచేయాలి: ఎంపీడీవో

ఓర్వకల్లు, ఆగస్టు 14: పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులు విధుల్లో అంకితాభావంతో పనిచేయాలని ఎంపీడీవో శివనాగప్రసాద్ అన్నారు. మంగళవారం మూడు రోజుల శిక్షణ కార్యక్రమం ముగిసింది. ఆయన మాట్లాడుతూ ప్రతి పంచాయతీకి ప్రణాళిక అవసరమని, పారిశుధ్యంపై ప్రత్యేక దృషి సారించాలని అన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ సుబ్బరాయుడు, సర్పం చులు మోహన్ రెడ్డి, చంద్రగోవర్ధనమ్మ, వెంకటరమణ, పెద్ద కాశీం, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రోగి బంధువు, డాక్టర్ల మధ్య ఘర్షణ

దాడి చేసిన వైద్యులే రోడ్డెక్కి ఆందోళన

కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 14: జూనియర్ డాక్టర్లు సమ్మెలో ఉన్నారు. దీంతో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో సేవలు స్తంభించిపోయాయి. అత్యవసర రోగులు ప్రైవేటు బాట పట్టారు. వార్డుల్లో రోగులకు నర్సులే దిక్కయ్యారు. ఈ పరిస్థితుల్లో జనరల్ సర్జరీ వార్డుకు వచ్చిన పీజీ విద్యార్థినిని ఆ వార్డులోని రోగులు గట్టిగా నిలదీశారు. ఎక్క డో కలకత్తాలో సంఘటన జరిగితే.. ఇక్కడ ఆసుపత్రిలో సమ్మె వల్ల పేద రోగులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. దీంతో సహనం కోల్పో యిన పీజీ విద్యార్థి రోగుల పట్ల దురుసుగా ప్రవర్తించారు. సర్జరీ వార్డులో ఉన్న ఓ రోగికి మూడు రోజులుగా కాలి గాయానికి డ్రెసింగ్ చేయడం లేదని రోగి కుమారుడు గిరీష్ పీజీ డాక్టర్‌తో అన్నాడు. తన తండ్రికి షుగర్ ఉందని, గాయం ఇంకా తీవ్రమవుతుందని అన్నాడు. దీంతో ఆ పీజీ డాక్టర్ సమ్మె చేయడం తమ హక్కు అని గిరీష్‌పై దురుసుగా ప్రవర్తించి చేయి చేసుకున్నారు. గిరీష్ ప్రతిఘటించారు. మిగిలిన జూనియర్ డాక్టర్లు చేరుకుని గిరీష్‌ను విచక్షణారహితంగా కొట్టి పోలీసులకు సమాచారం ఇచ్చి స్టేషన్‌కు తీసుకెళ్లారు. రోగి బంధువులపై దాడి చేయడమే కాకుండా తమపైనే దాడి చేశాడని జూనియర్ డాక్టర్లు కలెక్టరేట్ ముందు ఉన్న ఎన్టీఆర్ సర్కిల్‌లో రోడ్డుపై బైఠాయించారు. అనంతరం దర్నా చేశారు. జూడాల ఆందోళనతో ట్రాఫిక్ స్థంభించింది.

తన తండ్రికి వైద్యం చేయమని కోరినందుకు తనను దుర్భాషలాడి డాక్టర్లు దాడి చేసి కొట్టారని, కేసు పెట్టారని.. బాధితుడు గిరీష్ వాపోయారు. జూనియర్ డాక్టర్లపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.

'విజయంతో తిరిగి రావాలి'

కర్నూలు(స్పోర్ట్స్), ఆగస్టు 14: అనకాపల్లిలో ఈ నెల 30వ తేదీ నుంచి సెప్టెంబరు 1వ తేదీ వరకు జరిగే రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు విజయంతో తిరిగి రావాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, ప్రముఖ న్యాయవాది శ్రీధర్ రెడ్డి కోరారు. నగరంలోని స్పోర్ట్స్ అథారిటీ మైదానంలో రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు వెళ్లే జిల్లా జట్టు క్రీడాకారుల ఎంపిక పోటీలను నిర్వహించారు. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, ప్రముఖ న్యాయవాది శ్రీధర్ రెడద్డి, జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేసన్ ఉపాధ్యక్షుడు కేఈ శివరాంగౌడు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లోని వైండింగ్ కాయిల్స్ చోరీ

కల్లూరు, ఆగస్టు 14: కల్లూరు మండలంలోని దూపాడులో గత రాత్రి 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ (ఐఎస్‌సీ నుంబరు-387)లోని ఆయిల్, వైండింగ్ కాయిల్స్ చోరీకి గురయ్యాయని విద్యుత్‌శాఖ కర్నూలు రూరల్ ఏడీఈ సుబ్బన్న తెలిపారు. బుధవారం ఆయన సంఘటనా స్థలాన్ని పరిశీలించి దొంగతనం జరిగినట్టు గుర్తించారు. విద్యుత్‌శాఖకు రూ.25 వేల నష్టం జరిగిందని ఏడీఈ తెలిపారు. ఉలిందకొండ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

టీడీపీ నాయకులు అప్రమత్తంగా ఉండాలి

టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి.తిక్కారెడ్డి



కర్నూలు(కల్చరల్), ఆగస్టు 14: వైసీపీ వారు ఓటమి అక్కసుతో ఉన్నారని, హత్యలకు వెను కాడటం లేదని, అందువల్ల టీడీపీ నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి.తిక్కారెడ్డి అన్నారు. రాష్ట్రంలో అధికారాన్ని కోల్పోయిన తర్వాత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఢిల్లీకి వెళ్లి రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతోం దని, వెంటనే రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేస్తూనే మరోపక్క తన పార్టీ క్యాడర్‌తో టీడీపీని అంతమొందించేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. అందువల్ల టీడీపీ నాయకులు, కార్యకర్త లు అధికారంలోకి వచ్చామనే ఆలోచన పక్కనపెట్టి అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. బుధవారం పత్తికొండ నియోజిక వర్గం, హోసూరు మాజీ సర్పంచ్ శ్రీనివాసులు హత్య నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ నేత జగన్ ప్రవర్తన దొంగే దొంగ అన్నట్లు ఉందని విమర్శించారు.

టీడీపీ నేత శ్రీనివాసులు హత్య దారుణం: ఎంపీ

ఎన్నికల్లో ఓటమిని జీర్ణించుకోలేక వైసీపీ నాయకులు టీడీపీ శ్రేణులను హతమారుస్తున్నారని, ఇందులో భాగంగా టీడీపీ నేత శ్రీనివాసులును హత్య చేయడం దారుణమని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. బుధవారం ఎంపీ బస్తిపాటి నాగరాజు పత్తికొండ మండలం హోసూరులో హత్య కు గురైన మాజీ సర్పంచ్, టీడీపీ నేత శ్రీనివాసులు మృతదేహాన్ని, హత్య జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు.

లక్ష్మీ కులశేఖర్‌కు నివాళి

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 14: ఇటీవల మృతి చెందిన ప్రముఖ సినీ, నాటక రచయిత పల్లేటి లక్ష్మీ కులశేఖర్‌కు జిల్లా రంగస్థల కళాకారుల సంఘం ఆధ్వర్యంలో కళాకారులు నివాళులు అర్పించారు. బుధవారం నగరంలోని మద్దూరునగర్‌లో గల పింగళి సూరన తెలుగుతోట సమావేశ హాలులో కులశేఖర్ సంతాప సభ నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పుష్పమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా పలువురు కళాకారులు పల్లేటి నాటక రంగానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాటక దర్శకుడు వీవీ రమణారెడ్డి, సీనియర్ కళాకారులు సీహెచ్ చంద్రన్న, గుర్రపుశాల అంకయ్య, డి.దస్తగిరి, పి.హనుమంతరావు చౌదరి, షఫీయుల్లా పాల్గొన్నారు.

అమరవీరుల ఆశయాలను కొనసాగిద్దాం

కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ బాలునాయక్



ర్యాలీని ప్రారంభిస్తున్న కార్మిక శాఖ జాయింట్ కమిషనర్

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 14: అమరవీరుల ఆశయాలను కొనసాగిద్దామని కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ ఎం. బాలునాయక్ తెలిపారు. బుధవారం సంకల్‌బాగ్ భాష్యం పాఠశాల ప్రిన్సిపాల్ శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో స్వతంత్ర భారత నిర్మాణంలో జాతీయపతాకం పోషించన పాత్ర అందరిలో స్ఫూర్తి కలగాలని చేపట్టిన ర్యాలీని బాలునాయక్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రాఘవేంద్ర, ఉపకమిషనర్ వెంకటేశ్వర్లు, సహాయ అధికారులు కేశన్న, వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్ పాల్గొన్నారు.

ఐ లవ్ జీజీహెచ్ ప్రారంభం



ఐ లవ్ జీజీహెచ్‌ను ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్

కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 14: 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో ఐ లవ్ జీజీహెచ్ సెల్ఫీ ప్లాట్‌ను బుధవారం సాయంత్రం ఆసుపత్రి సూపరింటెండెంట్ సి.ప్రభాకర్ రెడ్డి ప్రారంభించారు. స్వచ్ఛ భారత్ తరహాలో దీన్ని ఏర్పాటు చేశామని, ఇప్పటికే డ్రైనేజీ, పనులు బాగా చేయించడం, కొత్తగా సిమెంటు చెత్త కుండీలు ఏర్పాటు చేశామన్నారు. ప్రజల సహకారంతో ఆసుపత్రిని శుభ్రంగా ఉంచేందుకు అవగాహన పెంచేందుకు దీన్ని ప్రారంభించామన్నారు.

నేడు టీజీవీ కళాక్షేత్రంలో పంద్రాగస్టు వేడుకలు


కర్నూలు(కల్చరల్), ఆగస్టు 14: నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో గురువారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య తెలిపారు. ఈ వేడుకల్లో భాగంగా సాయంత్రం 6 గంటలకు పౌరాణిక నాటక (చతుర్థాంకములు) ప్రదర్శిస్తున్నట్లు ఆయన తెలిపారు. శివ వెంకటసాయి నాటక కళాసమితి వారి ఆధ్వర్యంలో ఈ ప్రదర్శనలు ఉంటాయని, ప్రముఖ సంగీత కళాకారుడు జేఎం రాజశేఖర్ సహాయార్థం ఈ కార్యక్రమం ఏరాపటు చేసినట్లు ఆయన తెలిపారు.

● నేడు సంపూర్ణ భగవద్గీత పారాయణం: నగరంలోని శ్రీ విద్యాప్రకాశనందగిరి స్వామి గీతాప్రచార సంఘం ఆధ్వర్యంలో, పవిత్ర ఏకాదశి పర్వదిన సందర్భంగా గురువారం ఉదయం 9.30 గంటలకు సంపూర్ణ భగవద్గీత పారాయణం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు డీవీ రమణ తెలిపారు. నగరంలోని సంకల్‌బాగ్‌లోగల గీతాప్రచార ధామం సమావేశం హాలులో ఉంటుందని తెలిపారు.

● నేడు యవ్వనస్థుల రిట్రీట్ : కోల్స్ సెంటీనియల్ తెలుగు బాప్టిస్టు చర్చిలోని యవ్వయస్థుల విభాగం ఆధ్వర్యంలో గురువారం ఉదయం 10 నుంచీ సాయంత్రం 5 గంటలకు వరకు ఒక్కరోజు యవ్వనస్థుల రిట్రీట్ కార్యక్రమం ఉంటుందని చర్చి డైరెక్టర్లు ఎలిజబెత్, రోషిత్ షబుయేల్ తెలిపారు. ఈ రిట్రీట్‌లో ముఖ్య ప్రసంగీకులుగా కడప నగరానికి చెందిన అంతర్జాతీయ టీవీ ప్రసంగీకుడు, కృప పరిచర్యలు మినిస్ట్రీస్ డైరెక్టర్ జోసెఫ్ ప్రసన్నకుమార్ దైవ సేందేశం అందజేస్తారని వారు తెలిపారు.

టీడీపీ నాయకుడి దారుణ హత్య

● వాకిటి శ్రీనివాసులుపై వేట కొడవళ్లతో దాడి ● హోసూరులో ఘటన


వాకిటి శ్రీనివాసులు (ఫైల్)

పత్తికొండ, ఆగస్టు 14: టీడీపీ నాయకుడు వాకిట శ్రీనివాసులు(45) బహిర్భూమికి వెళ్లిన సమయంలో ప్రత్యర్థులు వేటకొడవళ్లతో నరికి హత్య చేశారు. పత్తికొండ మండలం హోసూరు గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున ఈ దారుణ సంఘటన జరిగింది. హోసూరు గ్రామ టీడీపీ నాయకుడు వాకిటి శ్రీనివాసులు మంగళవారం తెల్లవారుసజామున 5గంటల ప్రాంతంలో గ్రామ సమీపంలో కల్లందొడ్డిలో బహిర్భూమికి వెళ్లాడు. ఆ సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు వేటకొడవలితో దాడి చేయడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. హత్య ఆనవాళ్లు లేకుండా చేసేందుకు దుండగులు మృతదేహంపైన, చుట్టుపక్కల కారంపొడి చల్లి పారిపోయారు. గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, పత్తికొండ సీఐ జయన్న, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు స్బిబందితో సంఘటనా స్థలానికి చేరుకొని విచారణచేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పత్తికొండ ఆసుపత్రికి తరలించారు.

కన్నీరు పెట్టుకున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

టీడీపీ నాయకుడు వాకిటి శ్రీనివాసులు హత్యోదంతం తెలుసుకున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు టీడీపీ నాయకుడు సాంబశివారెడ్డితో కలసి గ్రామానికి చేరుకున్నాడు. శ్రీనివాసులు మృతదేహాన్ని చూసిన ఆయన ఉద్వేగానికి గురై కన్నీరుపెట్టుకున్నారు. నిందితులను తొందరగా పట్టుకోవాలని పోలీసులకు సూచించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, నాయకులు మనోహర్ చౌదరి, చల్లా రవీంద్రనాథ్ చౌదరి, ప్రమోద్‌కుమార్‌రెడ్డి, బత్తిన వెంకట్రాముడు మృతదేహాన్ని పరిశీలించారు.

సంఘటనా ప్రాంతాన్ని పరిశీలించిన ఎస్పీ

కర్నూలు ఎస్పీ బిందుమాధవ్ సంఘటనా ప్రాంతానికి చేరుకుని హత్యజరిగిన తీరును పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఘటనను అన్నికోణాల్లో విచారించి తొందరలో నిందితులను అరెస్టు చేస్తామన్నారు.


సంఘటనా స్థలాన్ని ఎస్పీ బిందుమాధవ్, టీడీపీ నేత తుగ్గలి నాగేంద్ర

క్లూస్‌టీం.. పోలీస్ జాగిలంతో పరిశీలన..

హత్య జరిగిన ప్రాంతంలో కర్నూలు నుండి వచ్చిన క్లూస్‌టీం ఆధారాలను సేకరించింది. మృతదేహం వద్ద వాసన చూసిన పోలీస్ జాగిలం వాకిటి శ్రీనివాసులు మామ ఇంటికి, అక్కడి నుంచి శ్రీనివాసులు ఇంటికి వెళ్లింది. తిరిగి హత్య జరిగిన స్థలానికి వెళ్లి, పొలాల్లోంచి పత్తికొండ-గుంతకల్ ప్రధాన రహదారికి చేరుకుంది.

ఆసుపత్రి వద్దకు చేరుకున్న వందలాది మంది

పోస్టుమార్టం నిమిత్తం పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి వాకిటి శ్రీనివాసులు మృతదేహం తరలించారు. అక్కడికి గ్రామస్థులు వందలాదిగా చేరుకున్నారు. సాయంత్రం వైద్యులు పోస్టుమార్టం పూర్తి చేశారు.

గ్రామాధిపత్య పోరు కారణమా..?

వాకిటి శ్రీనివాసులు తన మేనమామ సంజప్ప కూతురు శారదను వివాహం చేసుకున్నాడు. 2013లో సర్పంచ్ ఎన్నికల్లో శారద గెలిచింది. 2024 ఎన్నికల్లో గ్రామంలో టీడీపీకి 400పై చిలుకు మెజార్టీ రావడానికి శ్రీనివాసులు కృషి చేశారు. మండలస్థాయి నామినేటెడ్ పదవి రేసులో ముందంజలో ఉన్నాడు. మండల స్థాయి నాయకుడిగా ఎదుగుతున్న సమయంలో దారుణ హత్యకు గురికావడం చర్చనీయాంశమైంది.


కంటతడి పెట్టుకుంటున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం

ఆటో బోల్తా.. ఒకరి మృతి

● ఇద్దరికి గాయాలు

తుగ్గలి, ఆగస్టు 14: పత్తికొండ నుంచి గుత్తికి వెళ్తున్న ఆటో బోల్తా పడటంతో సజ్జల గురుస్వామి (65) అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. బుధవారం మండల పరిధిలోని రాతన ఆశ్రమ పాఠశాల వద్ద పత్తికొండ నుంచి గుత్తి వైపు వెళ్తున్న ఆటోకు కుక్కలు అడ్డం వచ్చాయి. ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఆటోలో ఉన్న హోసూరు చెందిన గురుస్వామి అక్కడికక్కడే మృతి చెందగా.. భార్య శారదమ్మకు, మరొకరికి స్వల్పగాయాలయ్యాయి. తుగ్గలి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పత్తికొండ వైద్యశాలకు తరలించారు. క్షతగాత్రులను వైద్యశాలకు తరలించి చికిత్సలు అందిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. మృతునికి ఐదుగురు కూతుళ్లు ఉన్నారు.

కర్నూలు రేంజ్ పరిధిలో 16 మంది సీఐల బదిలీ

కర్నూలు, ఆగస్టు 14: కర్నూలు అనంతపురం రేంజ్ పరిధిలో 16 మంది సీఐలను బదిలీ చేస్తూ డీఐజీ డా.కోయ ప్రవీణ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు

సీఐ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
ఎస్.అస్రార్ బాషా	నంద్యాల త్రీటౌన్ యూపీఎస్	నంద్యాల తాలుకా యూపీఎస్
ఎస్.సూర్య మౌళి	నంద్యాల తాలుకా యూపీఎస్	నంద్యాల త్రీటౌన్ యూపీఎస్
టి.నారాయణ యాదవ్	జమ్మలమడుగు యూపీఎస్, వైఎస్సార్ కడప	ఆర్ఎస్ఏఎస్‌టీఎఫ్, కడప
ఎస్.లింగప్ప	పులివెందుల రూరల్, వైఎసానర్ కడప	జమ్మలమడుగు యూపీఎస్, కడప
వి.కిరణ్ కుమార్ రెడ్డి	వీఆర్, కర్నూలు	పాణ్యం సర్కిల్, నంద్యాల
జి.సుగుణ కుమారి	డీటీసీ, కర్నూలు	వీఆర్ఎస్పీ, కర్నూలు (సాంక్షన్ పోస్టు)
పి.గౌతమి	కర్నూలు ట్రాఫిక్ పీఎస్	డీటీసీ, కర్నూలు
ఎస్.మన్సూరుద్దీన్	వీఆర్, కర్నూలు	కర్నూలు ట్రాఫిక్ పీఎస్
ఏ.తిక్కస్వామి	వీఆర్, కర్నూలు	కర్నూలు త్రీటౌన్ పీఎస్ (అడిషినల్ పోస్టు)
ఎం.శ్రీనాథరెడ్డి	డీఎస్‌బీ-2, కర్నూలు	పీసీఆర్, ఆదోని, కర్నూలు
పిటీ కేశవరెడ్డి	వీ అండ్‌ఈ కర్నూలు (ఆన్ రిపాట్రిషన్)	డీఎస్‌బీ-2, కర్నూలు
జి.జీవన్ గంగనాథ్ బాబు	ఎల్ఆర్ పల్లి సర్కిల్, అన్నమయ్య	పులివెందుల యూపీఎస్, వైఎస్సార్ కడప
సి.శంకర్ రెడ్డి	పులివెందుల యూపీఎస్, వైఎస్సార్ కడప	వీఆర్, కడప
ఎస్.వెంకటరమణ	పులివెందుల యూపీఎస్ వైఎస్సార్ కడప	పులివెందుల రూరల్, వైఎస్సార్ కడప
జి.వెంకటేశ్వర్లు	రాజంపేట యుపీఎస్, అన్నమయ్య	కడప తాలుకా యూపీఎస్, వైఎస్సార్ కడప
ఎస్.వెంకట నాగరాజు	కడప తాలుకా యూపీఎస్, వైఎస్సార్ కడప	రాజంజేట యూపీఎస్, అన్నమయ్య

కేజీబీవీ పాఠశాల తనిఖీ


విద్యార్థులతో మాట్లాడుతున్న లోక్ అదాలత్ జడ్జి లీలా వెంకటశేషాద్రి

ఓర్వకల్లు, ఆగస్టు 14: ఓర్వకల్లులో ఉన్న కస్తూర్బా గాంధీ పాఠశాలను బుధవారం లోక్ అదాలత్ జడ్జి లీలా వెంకటశేషాద్రి తనిఖీ చేశారు. వంట గది, సరుకులు, కంప్యూటర్ గది, కూరగాయల గదులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి భోజన వసతుల గురించి ఆరా తీశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, క్రీడల్లో రాణించేలా కృషి చేయాలని సూచించారు. విద్యార్థులకు పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వో హరిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆస్తి కోసం తల్లిదండ్రులపై దాడి

సి.బెళగల్, అగస్టు 14: మండలంలోని కొత్తకోట గ్రామానికి చెందిన కరణం మల్లికార్జున, భార్య సుజాత, కూతురు ఇంద్రాణిలపై ఆస్తి కోసం కొడుకులు విజయ్, నాగార్జున, కోడళ్లు హేమలత, ప్రభావతి దాడి చేశారు. ఈ ఘటన బుధవారం జరిగింది. ఆస్తి పంపకాల్లో తేడా వచ్చిందని ఆగ్రహించి కొడుకులు, కోడళ్లు ఈ దాడికి పాల్పడ్డారని కరణం మల్లికార్జున ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గ్రామంలో విచారణ చేసి నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తిమ్మారెడ్డి తెలిపారు.

కాలనీవాసులపై దొంగల దాడి

● దేహశుద్ధి చేసిన గ్రామస్థులు

మంత్రాలయం, ఆగస్టు 14: మంత్రాలయం మండలం తుంగభద్ర రైల్వేస్టేషన్ తారనాథ్ ఆశ్రమ సమీపంలో మంగళవారం అర్ధరాత్రి దాటాక దొంగలు హల్‌చల్ చేశారు. కాలనీలోకి ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు రాడ్లతో రావడం గమనించిన ఆనందమ్మ, ఆమె కుమారుడు రవి వారిని ప్రశ్నించారు. దీంతో వారు ఆ తల్లీ కొడుకుల తలపై రాడ్లతో దాడి చేశారు. అంతలో పక్కింటి వారు వచ్చి ఆగంతకుల్లో ఒకరిని ఒకరిని పట్టుకుని చితకబాదారు. ఒక దొంగ పరారయ్యాడు. గ్రామాల్లో బీహార్, చత్తీస్‌ఘడ్ ప్రాంతాల నుంచి వచ్చిన దొంగలు సంచరిస్తున్నట్లు ప్రజలు అంటున్నారు. ఈ విషయంపై మాధవరం ఎస్‌ఐ కృష్ణమూర్తిని వివరణ కోరగా.. తమ దృష్టికి రాలేదన్నారు.

భళా.. బసవన్నలు

● ఏడు గంటల్లో పదెకరాల్లో గుంటక

కోసిగి, ఆగస్టు 14: మండలంలోని జంపాపురం గ్రామానికి చెందిన తుమ్మలబీడు లింగారెడ్డి అనే రైతుకు చెందిన ఎద్దులు ఏడు గంటల్లో పదెకరాల పత్తి పంటలో గుంటక పట్టి భళా అనిపించుకున్నాయి. బుధవారం రైతు లింగారెడ్డి తన పదెకరాల పత్తి పొలంలో ఉదయం 5గంటల నుంచి 12 గంటల వరకు గుంటక పట్టాడు. మూడు రోజులు చేసే పనులను ఒకే రోజు ఏడు గంటల్లో అయన ఎద్దులు పూర్తి చేశాయి. ఈ సందర్భంగా ఎద్దులను పొలం నుంచి డప్పు వాయిద్యాలతో గ్రామంలోని బసవేశ్వర స్వామి ఆలయం దగ్గరికి ఊరేగింపుగా తీసుకొచ్చి పూజలు చేశారు.


గుంటకపాసిన ఎద్దులతో యజమానులు

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లైయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటన దారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. మేనేజర్ - ఏడివిటి

వైసీపీ నాయకుల వీరంగం


పోలీస్‌స్టేషన్ వద్ద గ్రామస్థులు

ఆదోని రూరల్ ఆగస్టు 14 : మండలంలోని కపటిలో గ్రామంలో వైసీపీ నాయకులు వీరంగం సృష్టించారు. గ్రామంలో నూతనంగా గ్రామస్థులంతా కలిసి సుంకలమ్మ దేవాలయాన్ని నిర్మించారు. ఈనెల 16న దేవాలయం ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేశారు. బుధవారం దేవాలయంలో హోమం కార్యక్రమం నిర్వహించారు. రాత్రి హోమం జరుగుతుండగా గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు ఆశీర్వాదం, రాజారత్నం మద్యం తాగి, చెప్పులు వేసుకొని దేవాలయంలోకి వెళ్తుండగా, అక్కడున్న భక్తులు వాదించారు. దీంతో కోపోద్రిక్తులైన వైసీపీ నాయకులు మేము దళితులు కావడంతోనే మమ్మల్ని లోపలకు రానివ్వరా అంటూ వీరంగం సృష్టించారు. అటు భక్తులు, ఇటు వైసీపీ నాయకులు ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. అనంతరం నాయకులు, గ్రామస్తులు ఇస్వీ పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించి వైసీపీ నాయకులపై ఫిర్యాదు చేశారు. విచారించి చర్యలు తీసుకుంటామని ఎస్.ఐ నాగేంద్ర తెలిపారు.

ప్రతి ఇంటిపై జెండా ఎగరాలి

● ఘనంగా 'హర్ ఘర్ తిరంగా'
● జాతీయ పతాకంతో ర్యాలీ

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని ప్రముఖులు పిలుపునిచ్చారు. 'హర్ ఘర్ తిరంగా' యాత్రలో భాగంగా జాతీయ పతాకంతో ర్యాలీ, బైకు ర్యాలీ నిర్వహించారు. ప్రముఖులు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధులను ఎప్పటికీ మరవకూడదని వారు చేసిన త్యాగాన్ని కొనియాడారు. ప్రజల్లో దేశభక్తి భావాలను పెంపొందించే విధంగా, జాతీయ జెండా ప్రాముఖ్యతను తెలిపేలా చేయాలన్నారు.


మాట్లాడుతున్న ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి


నందవరంలో ర్యాలీ...


ఆదోని ఆర్ట్స్ కళాశాల విద్యార్థుల హృదయం ఆకారంలో జాతీయ జెండా ప్రదర్శన


ఆస్పరిలో 150 మీటర్ల జాతీయ జెండాను ప్రదర్శిస్తున్న నారాయణ ప్రైమ్ స్కూల్ విద్యార్థులు


ఆదోని మండలం బల్లేకల్లు గ్రామ వీధుల్లో జాతీయ జెండాను ప్రదర్శనగా తీసుకెళ్తున్న విద్యార్థులు


కోసిగిలో...


ఎమ్మిగనూరులో విద్యార్థులతో కమిషనర్


దేవనకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు


గోనెగండ్లలో...

హంద్రీనీవా నీటితో చెరువులను నింపాలి


సమావేశంలో మాట్లాడుతున్న గిడ్డయ్య

పత్తికొండ టౌన్, ఆగస్టు 14: జిల్లాలో 106 చెరువులకు హంద్రీనీవా కాల్వ ద్వారా చెరువులకు నీరు నింపాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సీఆర్ భవన్‌లో సీపీఐ శాఖ కార్యదర్శులు, ప్రజా సంఘాలతో సమావేశం నిర్వహించారు. గిడ్డయ్య మాట్లాడుతూ జిల్లాలోని ఉన్న చెరువులకు హంద్రీనీవా కాల్వ ద్వారా నీరు నింపడమే కాకుండా పందికోన రిజర్వాయరు ద్వారా ఆయకట్టు కుడి, ఎడమ కాలువలకు పూర్తి స్థాయిలో సాగు నీరు అందించేందుకు పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కర్నూలు జిల్లాలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రతి ఎకరాకు సాగునీరు అందేలా చూడాలన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చి మెరుగైన పరిపాలన అందించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ మండల కార్యదర్శి రాజా సాహేబ్, జిల్లా కమిటీ సభ్యులు గురుదాస్, కారన్న, తిమ్మయ్య, ఈరన్న, ప్రజా సంఘాల నాయకులు రంగన్న, గిడ్డయ్య, నెట్టికంటయ్య, కాశీ, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లెల్సీ ఆయకట్టు రైతులకు సాగునీరు అందించాలి

ఆదోని (అగ్రికల్చర్), ఆగస్టు 14: తుంగభద్ర దిగువ కాలువ కింద సాగు చేస్తున్న ఆయకట్టు రైతులకు సాగునీరు అందేలా చూడాలని తెలుగు రైతు జిల్లా అధికార ప్రతినిధి, ఎల్లెల్సీ ఆయకట్టు పరిరక్షణ సమితి సభ్యుడు సాయిబాబు కోరారు. బుధవారం ఆయన హోస్పేట్ డ్యాంలోని డ్యాం సెక్రటరీ ఓఆర్‌కే రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు.

రైతులకు సాగునీరు అందించాలి

నందవరం, ఆగస్టు 14: ఎల్లెల్సీ ద్వారా రైతులకు సాగునీరు అందించాలని ముగతి సర్పంచ్ విరుపాక్షిరెడ్డి, సోమశేఖర్‌రెడ్డి కోరారు. బుధవారం ఎల్లెల్సీ డీఈ లక్ష్మణ్‌కుమార్‌తో మాట్లాడారు. ఆంధ్రాకు రావాల్సిన సాగునీటిని అందించాలని పై ప్రాంతంలో పోలీసు బందోబస్తు నిర్వహించి నీటిని విడుదల చేయించాలని అధికారులను కోరారు. రెండ్రోజుల్లో రైతులకు సాగునీరు అందేలా చూస్తామని రైతులకు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో రైతులు అయ్యపురెడ్డి, మాణిక్యం, సుకూరు, జయరాం, దస్తగిరి, లక్ష్మన్న, ఉసేని పాల్గొన్నారు.

ఉపాధి పనులపై నిర్లక్ష్యం వద్దు

● రైతులు పండ్ల తోటలపై దృష్టి సారించాలి

మంత్రాలయం, ఆగస్టు 14: మండలంలో ఉపాధి పనుల్లో నిర్లక్ష్యం వహించకుండా హౌసింగ్ బిల్లులు, పండ్ల మొక్కలపై దృష్టి పెట్టాలని ఎంపీడీవో మణిమంజరి, హౌసింగ్ డీఈ లాల్ కృష్ణయ్య అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి ఏపీవో తిమ్మారెడ్డి, ఈసీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి పనులకు కూలీల సంఖ్య పెరిగే విధంగా చూడాల్సిన బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్లపై ఉందన్నారు. హౌసింగ్ కింద వివిధ స్టేజీల్లో మంజూరు కావాల్సిన బిల్లులను వెంటనే మంజూరయ్యే విధంగా ఎస్టిమేషన్ పంపాలని ఆదేశించారు. బోర్లు కింద రైతులు తమ పొలాల్లో వివిధ రకాల పండ్ల మొక్కలను సాగు చేసేందుకు ప్రోత్సహించి వాటిపై దృష్టి పెట్టాలన్నారు. సమావేశంలో టెక్నికల్ అసిస్టెంట్లు రఘువీరనాయుడు, మరుద్యుతి, రేణుక, హనుమంతు, ఫీల్డ్ అసిస్టెంట్లు మజ్జిగ బొజ్జప్ప, కృష్ణ, దేవేంద్ర, నారాయణ రెడ్డి, రాగమ్మ పాల్గొన్నారు.

పేదల కోసమే ఆర్‌డీటీని స్థాపించాం


గిరిజన కుటుంబంతో మాట్లాడుతున్న నోమియా

మంత్రాలయం, ఆగస్టు 14: మంత్రాలయం మండలంలోని మాధవరం తండా గ్రామాన్ని స్పెయిన్ దేశస్థురాలు, ఆర్డీటీ దాత నోమియా ఎం.తండలోని గిరిజన కుటుంబాలను సందర్శించారు. బుధవారం ఏరియా టీమ్ లీడర్ కృష్ణయ్య, నరసింహులు ఆధ్వర్యంలో గ్రామాల్లో పర్యటించి పాఠశాల, పొదుపు సంఘాలు, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. గోవిందప్ప నాయక్, శాంతిబాయి కుటుంబంలో వారి ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్నారు. అనంతరం వారికి దుస్తులు, చీర, పాఠశాల, అంగన్‌వాడీలో చాక్లెట్లను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ పేదల బ్రతుకులు బాగుండాలన్న ఉద్దేశంతో ఆర్డీటీ సంస్థను స్థాపించామని, ప్రతి నిరుపేద ఆర్డీటీని సద్వినియోగం చేసుకుని జీవన నైపుణ్యాలు పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీటీ సీఈవో నరసింహులు, టీమ్ లీడర్లు వీరేష్ నాయక్, వెంకటేశ్ నాయక్‌లు ఉన్నారు.

ముగిసిన రీజనల్ క్రీడా పోటీలు


విద్యార్థికి ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న తహసీల్దార్ శేషఫణి

ఎమ్మిగనూరు, ఆగస్టు14: మండలపరిధిలోని నవోదయ విద్యాలయంలో మూడురోజులుగా జరుగుతున్న రీజినల్ లెవెల్ రోప్ స్కిప్పింగ్ పోటీలు బుధవారం ముగిశాయి. పోటీలకు ఏపీ,తెలంగాణ, కర్ణాటక, కేరళ రాష్ట్రాలలోని 22 నవోదయ విద్యాలయాల నుంచి 141మంది విద్యార్థులు హాజరయ్యారు. పోటీల్లో వివిధ ప్రాంతాలకు చెందిన 30మంది విద్యార్థులు ప్రతిభకనబరచి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. వీరికి స్థానిక నవోదయా విద్యాలయంలో 15రోజుల పాటు శిక్షణ అనంతరం కర్ణాటకలోని హసన్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభకనబరచి జాతీయ స్థాయికి ఎంపికయిన విద్యార్థులకు ఎమ్మిగనూరు మండల తహసీల్దార్ శేషఫణి ప్రశంశాపత్రాలు, మెడల్స్ అందచేసి అభినందించారు. కార్యక్రమంలో విద్యాలయం ప్రిన్సిపాల్ పద్మావతి, ఎంఈఓ ఆంజనేయులు, వైస్ ప్రిన్సిపాల్ చందిరన్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు బానిసలు కావద్దు

● ఆలూరు జూనియర్ సివిల్ న్యాయాధికారి హేమ


మాట్లాడుతున్న న్యాయాధికారి హేమ

ఆలూరు, ఆగస్టు 14: యువత చెడు అలవాట్లకు బానిసలు కావద్దని ఆలూరు జూనియర్ సివిల్ న్యాయాధికారి హేమ సూచించారు. బుధవారం ఆగ్రెడీ మండలం అరికెల తాండ గ్రామంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడుతూ, ఇటీవల కాలంలో మత్తు పదార్థాలకు అధికంగా బానిసలు అవుతున్నారని ఆ అలవాట్ల వల్ల మనిషి తన ఆధీనంలో ఉండకపోవడం వల్ల అనేక నేరాలు చేసే అవకాశం ఉందన్నారు. తల్లిదండ్రులు గమనించాలన్నారు. తమ పిల్లలను చదివించాలన్నారు. చదువుతూనే విజ్ఞానం పెరుగుతుందన్నారు. ప్రభుత్వం కూడా మాదక ద్రవ్యాల నియంత్రణకు అనేక చర్యలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ నరసింహులు, సీనియర్ న్యాయవాది వాయుజీవోత్తం రావ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళాల సేకరణ

ఆదోని రూరల్, ఆగస్టు 14 : కేరళ రాష్ట్రం వయనాడ్ వరద బాధితులకు సీపీఎం ఆధ్వర్యంలో విరాళాల సేకరణ చేపట్టారు. బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల అధికారులతో, ప్రజలతో విరాళాలను సేకరించారు. నాయకులు లక్ష్మన్న, లింగన్న, గోపాల్ మాట్లాడుతూ ప్రజలు ముందుకొచ్చి సహాయం చేయాలని పిలుపునిచ్చారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలను కొనసాగించాలి

ఆదోని (అగ్రికల్చర్), ఆగస్టు 14: ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ప్రస్తుతం ఉన్న చోటనే కొనసాగించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి షాబీర్ బాషా డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ఎమ్మిగనూరు సర్కిల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలను సీట్ల కేటాయింపుకు వెబ్‌సైట్‌లలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల పేరు లేకపోవడంతో ఆందోళన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి కౌన్సిలింగ్ అలాట్మెంట్ అయిన సీట్లను కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేయకుండా ప్రిన్సిపాల్ నిర్లక్ష్యంగా వ్యవహరించాలని ఆరోపించారు. కార్యక్రమంలో దస్తగిరి, శ్రీకాంతు, వీరేష్, తిరుమల, సోమశేఖర్, గిరి, వీరేంద్ర, పవన్, ఉసేని పాల్గొన్నారు.

అర్బన్ హెల్త్ సెంటర్‌లో సౌకర్యాలు కల్పించాలి

ఎమ్మిగనూరు, ఆగస్టు14: పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్‌లో రోగులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సీపీఎం నాయకులు గోవిందు, రాముడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్‌ను వారు పరిశీలించారు. నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం అర్బన్ హెల్త్ సెంటర్లకు వచ్చే రోగులకు అవసరమైన మందులు, ల్యాబ్, మంచాలు, బెడ్లు, సెలెన్ వంటటి సౌకర్యాలు కల్పించటం లేదన్నారు. దీంతో రోగులకు సరైన వైద్యం అందక రోగులు వైద్యం కోసం ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు.

ప్రారంభమైన ఉత్సవాలు

ఆస్పరి, ఆగస్టు 14: మండలంలోని తంగరడోన గ్రామంలో వెలసిన చింతల ముని, నల్లారెడ్డి స్వాముల దశమి ఉత్సవాలు బుధవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఆయా ఆలయాలలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమార్చన, మహా మంగళహారతులు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ పార్వతి ఇంటి నుంచి స్వాముల ఆభరణాలు, పుష్పాలను మేళ తాళాలతో తీసుకొచ్చి చింతల మునిస్వామి గుర్రాన్ని అలంకరించారు. భక్తులకు అన్నదాన, తాగునీటి వసతి, బస్సు సౌకర్యం కల్పించినట్లు సర్పంచ్ శంకరమ్మ, ఎంపీటీసీ నరసప్ప గ్రామ నాయకులు సీతారామరెడ్డి, వెంకన్న మాబు తెలిపారు.

దుండగులను వెంటనే అరెస్టు చేయాలి

పెద్దకడుబూరు , ఆగస్టు14: పత్తికొండ మండలం హోసురు గ్రామ టీడీపీ నాయకుడు శ్రీనివాసులును హత్యచేసిన దుండగులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర నాయకులు బొగ్గుల కోడిగుడ్ల ఏసేపు పోలీసులను కోరారు. బుధవారం అయన మాట్లాడుతూ టీడీపీ నాయకుడు శ్రీనివాసులును హత్యచేయడం దారుణమన్నారు.

రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకోవాలి

పత్తికొండ టౌన్, ఆగస్టు 14: భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకుని.. చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కల్పించుకోవాలని బార్ అసోసియేషన్ ప్రెసిడెంటు రంగస్వామి, లోక్ అదాలత్ ప్యానెల్ న్యాయవాదులు నగేష్, అశోక్ కుమార్ అన్నారు. బుధవారం స్వాతంత్ర దినోత్సవ వేడుకల ను పురస్కరించుకుని మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కస్తూర్బా పాఠశాల నందు న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. భారత రాజ్యాగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ షబానా, బార్ అసోసియేషన్ కోశాదికారి రాజశేఖర్ నాయుడు, సహాయ కార్యదర్శి వాసుదేవ నాయుడు, కోర్టు, సిబ్బంది పాల్గొన్నారు.

1నలో ఏఐటీయూసీ జాతీయ సమ్మేళనం

ఆదోని (అగ్రికల్చర్), ఆగస్టు 14: సెప్టెంబర్ 1, 2, 3 తేదీలలో విశాఖ మహానగరంలో జరిగే ఏఐటీయూసీ జాతీయ సమ్మేళనానికి కార్మికులంతా భారీగా తరలి రావాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజయ్ బాబు కోరారు. బుధవారం కార్మిక సంఘాల జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ. విశాఖ ఉక్కును కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరు నడుం బిగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.